




# నవతరం

హైదరాబాద్ సంపుటి : 9 సంచిక : 223 మంగళవారం, ఆగస్టు 11, 2026, పేజీలు - 4 వెల: 5/-


## తెలంగాణలో ముగిసిన
# సర్ ప్రక్రియ




**హైదరాబాద్:** తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగా ణలో 73,95,954 మంది ఓటర్లను తొలగిం చినట్లు సమాచా రం. ఇప్పటివరకు 2,64,30,4 94 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 78.14 శాతం డిజిట లైజేషన్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫా బాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్త య్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు.కాగా, తెలంగాణలో సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

## నాగార్జునసాగర్‌లో
# వరుణయాగం

- పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు
- నాగార్జునసాగర్‌లో విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో వరుణయాగం
- పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు
- హాజరైన మంత్రులు, ముఖ్యనేతలు

**నాగార్జునసాగర్:** రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌లో వరుణయాగం నిర్వహించింది. సాగర్‌లోని విజయ్ విహార్ ప్రాంగణంలో తెల్లవారుజామున 4 గంటలకు యాగ క్రతువు ప్రారంభం అయింది. యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు సూచించిన మేరకు 11 హోమ గుండాలతో 108 మంది రుత్వికులు ఈ క్రతువును నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ వైదిక క్రతువు వైభవోపేతంగా సాగింది. వరుణయాగం చివర్లో జరిగే పూర్ణాహుతితో యాగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.నదులు పరవళ్లు తొక్కాలని - రైతాంగం సుభిక్షంగా ఉండాలని : సాగర్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జలాశయాలు, చెరువులు నిండాలని, కృష్ణా, గోదావరి నదులు పరవళ్ళు తొక్కాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ వరుణయాగం నిర్వహించినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రైతాంగ ప్రయోజనాలే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని మంత్రి ఉత్తమ్ వివరించారు. ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటూనే, సంస్కృతి, అనుగ్రహాన్ని కూడా కోరుకుంటున్నామని మంత్రి చెప్పారు.పూర్ణాహుతి అనంతరం ముఖ్యమంత్రి నాగార్జున సాగర్ డ్యామ్‌ను పరిశీలించారు. జలాశయంలో డెడ్ స్టోరేజ్‌కు చేరిన నీటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరుణయాగంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు, దేవాదా య శాఖ మంత్రి కొండా సురేఖ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర , ముఖ్యనేతలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



## 'హర్ ఘర్ తిరంగా'తో ప్రతి ఇంటా
# దేశభక్తి చాటాలి



**హైదరాబాద్, ఆగస్టు 10:** 'హర్ ఘర్ తిరంగా'తో ప్రతి ఇంటా దేశభక్తి చాటాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. (సోమవారం) తన ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 14న ట్యాంక్ బండ్ దగ్గర భారీ 'తిరంగా యాత్ర'ను నిర్వహిస్తున్నామ ని. పార్టీల కతీతంగా ప్రజలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు.రాబోయే ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాంచందర్ రావు అన్నారు. అందులో భాగంగానే ఈరోజు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో పాల్గొని యువతతో కలిసి తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసినట్లు తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఇళ్లపై జెండాలు ఎగురవేయాలని కోరారు. అలాగే ఆగస్టు 14న హైదరాబాద్ ట్యాంక్ బండ్ దగ్గర చాలా పెద్ద ఎత్తున 'తిరంగా యాత్ర' నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వెల్లడించారు. హైదరాబాద్ ప్రజలందరూ కుల, మత, రాజకీయ విభేదాలను పక్కనబెట్టి, దేశం కోసం ఈ తిరంగా యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

## వర్షాల కోసం తెలంగాణ సర్కార్
# మహా వరుణ యాగం



**హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కృష్ణానది తీరాన నాగార్జునసాగర్ లో మహా వరుణ యాగాన్ని నిర్వహిస్తోంది. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, కృష్ణా, గోదావరి నదులు జలకళతో పరవళ్లు తొక్కాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి ఈ యాగం నిర్వహిస్తోంది. వేకువ జామున నాలుగు గంటలకే మొదలైన మహా వరుణ యాగంలో రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు ఆది పూజ నిర్వహించి యాగాన్ని ప్రారంభించారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు, వేదపండితు ల ఆధ్వర్యంలో యాగ క్రతువు కొనసా గుతోంది. వేద పండితులు, 11 హోమ గుండాల్లో దేవతా ఆవాహనం చేసి వరుణ యాగాన్ని ప్రారంభి ంచారు. తొలుత వేద పండితులు, రిత్వికులు మంత్రోచ్ఛారణల మధ్య విశ్వక్సేనుడికి ప్రత్యేక పూజలు చేశారు. యాగం నిర్విఘ్నంగా సాగాలని విఘ్నేశ్వరుడిని పూజించారు. యా గస్థలం, యజమానులు, పాల్గొనే ఋత్వికుల శుద్ధి చేసి పుణ్యాహవాచనంతో యాగశాల ప్రవేశం చేశారు. పవిత్ర కృష్ణానది జలంతో కలశాలను ఏర్పాటు చేసి, వాటిలో దేవతా ఆవాహనం చేసి కలశ స్థాపన చేశారు.108 మంది రుత్వికులు.. 11 హోమగుండాలు.. యాగశాల అంతా ఆధ్యాత్మిక శోభతో నిర్విరామంగా కొనసాగు తోంది. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పిస్తూ వరుణ యాగాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.

## ప్రధాని మోదీ ప్రతిష్ఠ నాశనమైంది- అమిత్ షా
# రాజీనామా చేయాల్సిందే



**ఢిల్లీ:** ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడంపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మండిపడ్డారు. స్టూడెంట్స్‌పై లాఠీఛార్జ్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ఠ నాశనమైందని ఆరోపించారు. దానిని తిరిగి పునర్నిర్మించలేరని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మరే ఇతర అధికారులు గానీ వారి చర్యల పర్యవసానాల నుంచి తప్పించుకోలేరని అన్నారు. ఓ జాతీయ వార్తాపత్రికకు రాసిన వ్యాసంలో రాహుల్ గాంధీ ఈ మేరకు మోదీ సర్కార్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు."జులై 20న దేశవ్యాప్తంగా వేలాది మంది యువత తాము ఎన్నుకున్న నాయకుడి నుంచి జవాబుదారీతనాన్ని ఆశించారు. కాస్త ఆలస్యమైనా యువతకు ఆ జవాబుదారీతనం లభిస్తుంది. జులై 20న దేశ యువత విద్యా వ్యవస్థ, పేపర్ లీక్‌లపై జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ ఏకమయ్యారు. అన్ని కులాలు, వర్గాలు, ప్రాంతాలు, మతాలకు చెందిన విద్యార్థులు ఈ నిరసనల్లో పాల్గొన్నారు. న్యాయం కోసం డిమాండ్ చేసేంత ధైర్యం, తమ రాజ్యాంగ హక్కులను తెలుసుకునేంత వివేకం, పోరాడి గెలవగలమని నమ్మేంత నిబద్ధత విద్యార్థులకు ఉన్నాయి. నిరసనకారులు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ, నవ్వుతూ, చేతులు పట్టుకుని ఐక్యంగా నిలబడడాన్ని యావత్ దేశం ఆశ్చర్యంతో చూసింది. ఈ నిరసనలు భారతదేశపు గర్వించదగిన వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లాయి. ఈ సంప్రదాయమే దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టింది. "


## కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ఫీచర్లను పట్టాదారు
# పాస్ పుస్తకాలకు ఇస్తున్నాం



**అమరావతి:** ప్రజా సమస్యల పరిష్కారమే తమ ఏకైక అజెండా అని సీఎం చంద్రబాబు అన్నారు. సుపరిపాలనే తమ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ఏలూరు జిల్లా కలిదిండిలో చంద్రబాబు పర్యటించారు. 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు."ప్రధాని మోదీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ సూపర్ స్పీడ్‌లో పరుగెడుతోంది. రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ అధికారులు గట్టిగా పని చేయాల్సిందే. పట్టాదార్ పాస్ పుస్తకంపై వేరే వాళ్ల ఫొటో వేసుకుంటే ఊరుకుంటామా? గత ప్రభుత్వ విధ్వంసం వల్ల అనేక సమస్యలు వచ్చాయి. భూసమస్యలపైనే ఎక్కువ అర్జీలు వచ్చాయి. ఎట్టి పరిస్థితుల్లో భూసమస్యలను పరిష్కరించాలని అనుకున్నాం.""సమస్యలు పరిష్కరిస్తేనే జనాలు జై కొడతారు. లేకపోతే చూశాం కదా 11కి పరిమితం చేశారు. బటన్ నొక్కడం, పరదాల చాటున రావడం, సభలు పెట్టి చెట్లు నరికేయటం గత పాలకులు చేశారు. కానీ మేం ప్రతీ నెలా ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే ఈ సమావేశాల ద్వారా ప్రజల్ని కలుస్తున్నాం. కరెన్సీ నోట్లకు ఉండే పటిష్టమైన భద్రతా ఫీచర్లను పట్టాదారు పాస్ పుస్తకాలకు కూడా అమలు చేస్తున్నాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ఆస్తుల వివరాలను ట్యాంపర్ చేయకుండా భద్రత కల్పించాం. క్యూఆర్ కోడ్ సహా ఇతర సాంకేతిక పరమైన భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశాం. 32.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పటి వరకూ రైతులకు, భూ యజమానులకు అందించాం. 9365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేయాల్సి ఉంది" అని చంద్రబాబు వివరించారు.పాస్ పుస్తకాన్ని ఎవరూ ట్యాంపర్ చేయకుండా : "7450 గ్రామాల్లో 32 లక్షల 22 వేల 346 పాస్‌పుస్తకాలు ఇచ్చాం. పాస్ పుస్తకాన్ని ఎవరూ ట్యాంపర్ చేయకుండా తయారుచేశాం. ఎవరైనా ట్యాంపర్ చేసేందుకు ప్రయత్నిస్తే వెంటనే తెలిసిపోతుంది.

## రష్యాపై ఉక్రెయిన్
# భారీ దాడి.

**12 మంది మృతి.39 మందికి గాయాలు**



**రష్యా:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా రష్యాకు భారీ నష్టం జరిగింది. ఈ యుద్ధం మొదలైన తర్వాత ఒకేసారి అత్యధిక ప్రాణ నష్టం సంభవించింది. రష్యాపై తాజాగా ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడిలో ఏకంగా 12 మంది మరణించారు. మరో 39 మంది వరకు గాయపడ్డారు. సెంట్రల్ రష్యా, టాటార్‌స్తాన్ పరిధిలోని నినేకామ్స్క్ పట్టణంపై ఉక్రెయిన్ డ్రోన్‌తో దాడి చేసింది. ఈ విషయాన్ని స్థానిక మీడియా సోమవారం వెల్లడించింది. నినేకామ్స్క్ పట్టణం ఉక్రెయిన్ సరిహద్దుకు దాదాపు 1,000 కిలోమీటర్లకుపైగా దూరంలో ఉంటుంది.

## మనుషులకు 'ఆధార్' లాగే..
# భూములకూ 'భూధార్'




**హనుమకొండ, ఆగస్టు 10:** జిల్లాలోని ఎల్కతుర్తిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గత పాలకులు ఆర్భాటంగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేశారని.. ఎక్కడ కూడా ఆఫీసులు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 180 రెవెన్యూ తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన సంవత్సరంలోపు పూర్తి చేశామని తెలిపారు.ధరణిని బంగాళాఖాతంలో వేశామని.. భూభారతి చేపట్టి రైతులకు పూర్తి భద్రత, భరోసా ఇచ్చేలా భూములను ప్రక్షాళన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ విలేజ్‌లోని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి మనిషికి ఎలాగైతే ఆధార్ ఉందో, భూములకు కూడా భూధార్ ఇస్తామని చెప్పారు. రైతులందరి సహకారంతో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఒక భద్రత, భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## కీ. శే. మండలి కృష్ణా రావు చిరస్మరణీయుడు

**- పురస్కార గ్రహీత నిమ్మరాజు**



**విజయవాడ, ఆగస్టు 10:**
రాజకీయ చరిత్ర లో ముందెన్నడూ లేని రీతిలో నభూతో నభవిష్యత్ అన్న చందంగా తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశ విదేశాల్లో ఏడాది పాటు ఎంతో ఘనంగా శత జయంతోత్సవాలు జరిపించుకున్న కీ శే మండలి వెంకట కృష్ణా రావు చిరస్మరణీయుడంటూ సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు ప్రస్తుతించారు. దివిసీమ గాంధీ గా ఉన్నతికెక్కిన కృష్ణారావు పేరిట తాను పాత్రికేయ పురస్కారాన్ని అందుకోవటం తన 45 ఏళ్ల జర్నలిజం చరిత్రలో ఎన్నటికీ మరువలేనిదన్నారు. 1980 నుంచి కూడా మండలి కుటుంబం తో తనకు సాన్నిహిత్యం ఉందన్నారు.భావితరాలకు ఆదర్శప్రాయుడైన మండలి కృష్ణారావు జీవిత చరిత్రను ప్రపంచవ్యాప్తంగా తెలుగు పాఠ్యాంశాలలో చేర్చేందుకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు తెలుగు రచయితల సంఘం, ఇతర తెలుగు సంఘాలు కృషి చేయవలసిందిగా నిమ్మరాజు విజ్ఞప్తి చేశారు.తిమ్మసముద్రం శ్రీ గోరంట్ల వెంకన్న సంస్కృతి కళాశాల లో ఐదేళ్ళపాటు భాషా ప్రవీణ కోర్సు పూర్తి చేసి ఆపై జర్నలిస్టుగా కొనసాగుతూనే నాలుగేళ్లపాటు జిల్లా పరిషత్.....ఇతర విద్యా సంస్థల్లో తెలుగు పండితునిగా పని చేయటం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఈ సందర్భంగా నిమ్మరాజు తెలిపారు.

## సూది కొండ సమస్యలపై ఆత్మీయ చర్చ

**- "వార్డు సమస్యలు పరిష్కరించేందుకు కృషి"**
**- "పెన్షన్ల అర్హులకు తక్షణ న్యాయం"**



**పలాస** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ సూది కొండ సూర్య కాలనీలోని సమస్యలు, రానున్న మున్సిపల్ ఎన్నికల పరిస్థితులపై నాయకులు ఆత్మీయంగా చర్చించారు. ఈ సమావేశంలో పలాస కాశీబుగ్గ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు పాల్గొని స్థానిక యువజన నాయకులు, పెద్దలతో సమస్యలపై చర్చించారు.సూది కొండ వార్డు యువజన నాయకులు సైని శివ, సీ. పాన శ్రీరాములు, పెద్దలు పైల షణ్ముఖరావు గారి ఇంట వద్ద ఈ సమావేశం జరిగింది. వార్డులో ప్రస్తుతం నెలకొన్న రోడ్డు, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని స్థానికులు గిరిబాబు దృష్టికి తీసుకొచ్చారు. వర్షాకాలంలో మురికి నీరు రోడ్లపై నిలవడం, తాగునీటి సమస్యలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు.పెన్షన్ల సమస్యపై చర్చ: అర్హత ఉన్నప్పటికీ పెన్షన్లు అందని వారి సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. 50 ఏళ్లు నిండిన వారికి వృద్ధాప్య పెన్షన్లు, భర్తలు కోల్పోయిన మహిళలకు వితంతు పెన్షన్లు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని బల్ల గిరిబాబు హామీ ఇచ్చారు. ఎన్నికలపై చర్చ: రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వార్డులో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడం గురించి కూడా చర్చించారు. ప్రజలకు మేలు చేసే నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ఎక్స్ కౌన్సిలర్ రోణంకి వెంకటరమణ, పెద్దలు వల్లభ వైకుంఠరావు, డి. నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు. వార్డు అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా తీర్మానించారు.

## బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్టు

**- 5 మద్యం సీసాల స్వాధీనం**



**హైదరాబాద్, నవతరం:** పాలకొల్లు ప్రొహిబిషన్ ఒ ఎక్సైజ్ స్టేషన్ శనివారం నిర్వహించిన దాడుల్లో పాలకొల్లు మండలం దిగమర్రు గ్రామానికి చెందిన బెల్ట్ షాపు నిర్వాహకుడు సిహెచ్ శేఖర్ ను అరెస్టు చేసి అతని వద్దనుండి 5 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో.. ఎస్ఐలు పి.మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు ప్రొహిబిషన్ ఒ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మద్ది రామ శేషయ్య హెచ్చరించారు.

# మెరిట్‌కు కత్తెర... అక్రమాలకు పట్టం!

**-"డీఎస్సీలో జరిగింది దోపిడీ"**
**- "లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి"**





**పలాస** డీఎస్సీ పరీక్షలు, నియామకాల్లో భారీ అవకతవకలు, అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ శ్రీకాకుళం జిల్లా పలాసలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందని, మెరిట్‌ను పక్కనపెట్టి అక్రమ నియామకాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ భారీ నిరసన ర్యాలీని నిర్వహించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆదేశాల మేరకు ఆయన సతీమణి, వైఎస్సార్‌సీపీ నేత సీదిరి శ్రీదేవి, నియోజకవర్గ పరిశీలకులు ధనుంజయ్ నేతృత్వంలో ఈ ర్యాలీ సాగింది. పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. చేతుల్లో ప్లకార్డులు, నినాదాలు చేస్తూ ర్యాలీగా బయలుదేరిన వారిని కాశీబుగ్గ పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల తీరును నిరసిస్తూ నాయకులు రోడ్డుపైనే బైఠాయించారు.అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీదిరి శ్రీదేవి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. డీఎస్సీ పేరుతో జరిగినది పూర్తిగా దోపిడీ అని మండిపడ్డారు. కృష్ణా జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి అత్యధిక మార్కులు సాధించిన అవినాష్ అనే అభ్యర్థికి ఉద్యోగం ఇవ్వకుండా, చాలా తక్కువ మార్కులు వచ్చిన వారికి నియామక పత్రాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని, మెరిట్ ఉన్న అభ్యర్థుల గొంతు నులిమే కుట్ర ఇదని ఆమె అన్నారు. పరీక్షలు నిర్వహించడంలో, ఫలితాలు ప్రకటించడంలో, నియామకాలు చేపట్టడంలో ప్రతి దశలోనూ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అధికార పార్టీకి చెందిన వారికి, డబ్బులు ఇచ్చిన వారికి ఉద్యోగాలు కట్టబెట్టారని, నిజమైన అర్హత ఉన్నవారు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను నాశనం చేసే కుట్రలో భాగంగానే ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.ఈ అక్రమాలన్నింటిపై తక్షణమే సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని సీదిరి శ్రీదేవి డిమాండ్ చేశారు. నిజాలు బయటకు రావాలంటే సీబీఐ దర్యాప్తు తప్పనిసరి అని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఈ మొత్తం వ్యవహారానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యతతో వెంటనే రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినందుకు ప్రభుత్వం



క్షమాపణ చెప్పాలని అన్నారు. నిరసనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు "మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేయాలి", "డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి", "లోకేష్ దిగిరా" అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వ తీరును ఎండగడుతూ నినాదాలు, పాటలతో హోరెత్తించారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని నాయకులు హెచ్చరించారు.ఈ ర్యాలీ, నిరసన కార్యక్రమం పలాస నియోజకవర్గంలో పెద్ద చర్చకు దారితీసింది. వందలాది మంది కార్యకర్తలు, మహిళలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ గళం వినిపించారు. డీఎస్సీ అక్రమాల వల్ల తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.వైఎస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, జడ్పీ వైస్ చైర్ పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్ యాదవ్, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య యాదవ్, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగసాయి కృష్ణ యాదవ్, వైఎస్సార్సీపి పలాస పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, వజ్రపు కొత్తూరు ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, వైఎస్సార్సీపి పలాస నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సుజాత పండా, వైఎస్సార్సీపి వజ్రపు కొత్తూరు మండల శాఖ అధ్యక్షులు తిర్రి రాజారావు, పలాస మండల శాఖ అధ్యక్షులు దువ్వాడ రవి, వైఎస్సార్సీపి జిల్లా కార్యదర్శులు దువ్వాడ మధుకేశ్వరావు, అగ్గున సూర్యారావు, వైఎస్సార్సీపి సీనియర్ నేతలు సొర్ర దిల్లేశ్వరరావు, వైఎస్సార్సీపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియ రామకృష్ణ, బత్తిన లక్ష్మణ్, పి. గురయ్యా నాయుడు, చింతాడ మాధవరావు, మద్దిలి బాలకృష్ణ యాదవ్, సేనాపతి కిషోర్, కర్రీ గోపాల్, బల్ల లీల కుమారి, సేనాపతి దివ్య, మార్పు వెంకటరమణ, మార్పు భవాని, మజ్జి హేమరాజ్, సీర ప్రసాద్, సిందిరి జగన్, నాగేశ్వర బృందావన్, దుర్గా శంకర్ పండ, బమ్మిడి సంతోష్, కంచరాన చినబాబు, బోర చంద్రకళ, యళ్ళ సంతోష్, ఉషారాణి, లక్ష్మి, చింతల సరస్వతి, బిరాటి వల్లభ, సనపల సింహాచలం తదితరులతోపాటు నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్సీపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, పలు ప్రజా సంఘాలు పాల్గొన్నారు.


## ఏపీ, తెలంగాణలో భారీ వర్షాలు.. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ.. వాతావరణశాఖ హెచ్చరిక ఇదే..



**విజయనగరం,:**ఏపీ, తెలంగాణకు వాతావరణశాఖ భారీ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. నేడు, రేపు పలు జిల్లాల్లో వర్షాలు పడతాయని హెచ్చరించింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. బుధవారం నాటికి ఇది అల్పపీడనంగా మారే అవకాశముందని, దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురవనున్నట్లు స్పష్టం చేసింది. ఏపీ విషయానికొస్తే.. అనకాపల్లి, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో భారీ వానలు పడతాయని హెచ్చరించింది. ఈ మేరకు మంగళవారం, బుధవారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇక పలుచోట్ల పిడుగులు పడే అవకాశముందని, ఉరుములు, మెరుపుల సమయంలో సురక్షిత ప్రదేశాల్లో తలదాచుకోవాలని సూచించింది.ఏపీకి రెడ్ అలర్ట్ జారీభోగాపురం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం, చోడవరం, వేపాడ, ఎస్ కోట వంటి ప్రాంతాల్లో పిడుగులు పడతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇక చిత్తూరు, తిరుపతి, నగరి, సత్యవేడు, పుతతూరు, కన్నవరం వంటి ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురుస్తాయని తెలిపింది. ఇక పార్వతీపురం మన్యం, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, ఉభయగోదావరి, ఏలూరు, శ్రీకాకుళం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక మిగతా జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది.తెలంగాణలో రెండ్రోజుల పాటు వానలుఇక తెలంగాణలో రాబోయే రెండ్రోజుల పాటు వర్షాలు , నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. కాగా ఏపీ, తెలంగాణలో ఇప్పటికే పలు జిల్లాల్లో వానలు పడుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలు విస్తరించినా అనుకున్నంతగా వర్షాలు పడలేదు. కానీ గత కొద్ది రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో కుండపోత వానలు కురుస్తున్నాయి.

## కులమంటే కుళ్ళు...!

మతమంటే ముళ్ళు..!!
తెలుసుకో నేస్తం ! నిజం తెలుసుకో
కులమంటే కుళ్ళని మతమంటే ముళ్ళని
తెలుసుకో నేస్తం ! నిజం తెలుసుకో !
గుడిలో మ్రోగెను
గణ గణ మని గంటల ధ్వని
బాధలు తెలియని భక్తుల భజనలు విని
తెలుసుకో నేస్తం ! నిజం తెలుసుకో !
బాషలు వేరైనా, భావం ఒకటేనని
భక్తులు వేలైనా,భగవంతుడు ఒకడేనని...
వినీల గగనంలో
వింత వింత రంగుల్లో బారులు తీరి
విహరించే విహంగాలను
తిలకించి ఓసారి
తెలుసుకో నేస్తం ! నిజం తెలుసుకో !
పక్షులు వేలైనా, రెక్కలు రెండేనని
రంగులు వేరైనా,రక్తం ఒకటేనని
తెలుసుకో నేస్తం ! నిజం తెలుసుకో
నిలదీసి అడిగే ముందు
నీ కులమేదని నీ మతమేదని
తెలుసుకో నేస్తం ! నిజం తెలుసుకో !
కులం కుళ్ళని మతం ముళ్ళని
కులం గజ్జి కుక్కని – తిరగనిస్తే తప్పని
మతం పిచ్చిమొక్కని పెరగనిస్తే ముప్పని
తెలుసుకో నేస్తం ! నిజం తెలుసుకో !
ఎందుకు నేస్తం !
మనకి భేదాలు వివాదాలు
జగతికి ప్రగతికి
యివి కావా జాడ్యాలు
కాలి కూలి పోవాలి
ఈ కుల మత కుడ్యాలు.
తెలుసుకో నేస్తం ! నిజం తెలుసుకో !
మంచితనమే మన కులమని...
మానవత్వమే మన మతమని....
మనుషులంతా ఒక్కటని...
తెలుసుకో నేస్తం ! నిజం తెలుసుకో !



**పోలయ్య కవి కూకట్లపల్లి**
**అత్తాపూర్ హైదరాబాద్**

# హ్యాపీ బర్త్ డే
# డా. నర్సింలు ఎల్లంపల్లి

- సీనియర్ జర్నలిస్ట్ నర్సింలు ఎల్లంపల్లి కి శుభాకాంక్షల వెల్లువ
- శ్రీనివాస్ నగర్ లో డా. ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన పలువురు నాయకులు, బంధువులు, జర్నలిస్ట్ లు
- ఆనందోత్సాహంతో ధన్యవాదములు తెలిపిన ఎల్లంపల్లి నర్సింలు

**హైదరాబాద్, నవతరం:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ జర్నలిస్ట్, నవతరం తెలుగు దినపత్రిక – నవతేజ్ టీవీ నేషనల్ మీడియా సీనియర్ రిపోర్టర్ (ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్) డా. నర్సింలు ఎల్లంపల్లి – బి.టెక్, ఎంబిఏ గారి పుట్టినరోజు సందర్భంగా పలువురు స్థానిక రాజకీయ నాయకులు, జర్నలిస్ట్ సోదరులు, సామజిక కార్యకర్తలు, బంధు మిత్రులు, అభిమానులు షాలువా కప్పి, కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అందరివాడు, స్వయంకృషీవలుడు, కష్టజీవి నిండు నూరేళ్లు ఇలాగే అందరి మన్ననలు పొందుతూ... పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని అన్నారు. అనంతరం, డా. ఎల్లంపల్లి నర్సింలు మాట్లాడుతూ... తనపై ఇంత ప్రేమను చూపిన బంధు మిత్రులు, శ్రేయిభిలాషులు అందరికీ ధన్యవాదములు అన్నా రు. ఈ కార్యక్రమంలో రోడామేస్త్రి నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుమస్తా మధుసూధన్, రఘు అన్న, శ్రీనివాస్ నగర్ మాజీ ప్రెసిడెంట్ నర్సింగ్ గౌడ్, మురళి గౌడ్, సార శ్రీనివాస్, సొప్ప గోవర్ధన్, ఆవుల నర్సయ్య, స్థానిక నాయకులు, జర్నలిస్ట్ లు, సామజిక కార్యకర్తలు, జర్నలిస్ట్ లు, బంధు మిత్రులు పాల్గొన్నారు.
















# రాజ్యాంగ విలువలే మా ప్రాధాన్యం


హైదరాబాద్ :హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ (నల్సార్) విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, వర్సిటీ అధికారుల మధ్య వివాదం చెలరేగింది. రానున్న స్నాతకోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా భారత ప్రధానన్యా యమూర్తి సూర్యకాంత్‌ను ఆహ్వానించాలన్న వర్సిటీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలువురు విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు వివిధ బ్యాచ్‌లకు చెందిన సుమారు 350 నుంచి 450 మంది విద్యార్థులు వర్సిటీ పరిపాలనా విభాగానికి ఆరు వేర్వేరు వినతిపత్రాలను సమర్పించారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండేలా ఈ ఆహ్వానాన్ని పునఃపరిశీలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల కాక్రోజ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో యువత చలో సంసద్ ఆందోళన చేపట్టగా.. నిరసనకారులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. పోలీసుల దౌర్జన్యం, అణచివేతకు సంబంధించిన ఆరోపణల విచారణ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని విద్యార్థులు తమ లేఖల్లో పేర్కొన్నారు. 'మాకు వీడియోల పట్ల ఆసక్తి లేదు.. చూసేందుకు మాకు సమయం లేదు.. మా సమయాన్ని వృథా చేయవద్దుట అంటూ న్యాయస్థానంలో ఆయన చేసిన వ్యాఖ్యలు బాధ్యతాయుతంగా లేవని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన అత్యున్నత న్యాయస్థానం నుంచి ఇలాంటి స్పందన రావడం తీవ్ర నిరాశను కలిగించిందని వారు అభిప్రాయపడ్డారు.సాధారణంగా ప్రతి ఏటా నల్సార్ స్నాతకోత్సవానికి భారత ప్రధానన్యాయమూర్తిని ముఖ్య అతిథిగా ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, విశ్వవిద్యాలయం తమకు నేర్పిన రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణ వంటి అంశాలకు ఈ ఆహ్వానం విరుద్ధంగా ఉందని విద్యార్థులు వాదిస్తున్నారు. 'ఒక విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం అనేది కేవలం డిగ్రీలను ప్రదానం చేసే వేడుక మాత్రమే కాదు. అది సంస్థ నమ్మే విలువలకు అద్దం పట్టాలి. పోలీసుల దౌర్జన్యాలను తేలికగా తీసుకునే ప్రముఖుల చేతుల మీదుగా పట్టాలు అందుకోవడం మా విద్యార్థి లోకానికి ఇబ్బందికరంగా ఉంది' అని విద్యార్థులు తమ లేఖల్లో స్పష్టం చేశారు.జెన్- జీ నిరసనలపై ాూా చీఫ్ సంచలన వ్యాఖ్యలుఈ విషయమై జూలై 23న తొలి వినతిపత్రాన్ని వైస్-ఛాన్సలర్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లకు సమర్పించగా.. దానికి మద్దతుగా మరో ఐదు బ్యాచ్‌ల విద్యార్థులు వరుస లేఖలను అందించారు. అయితే, విద్యార్థుల నుంచి ఇంత పెద్ద ఎత్తున వినతిపత్రాలు వెల్లువెత్తినప్పటికీ వర్సిటీ యంత్రాంగం నుంచి ఇంతవరకు ఎటువంటి అధికారిక స్పందన రాలేదు. వైస్-ఛాన్సలర్ శ్రీకృష్ణ దేవ రావును సంప్రదించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మరోవైపు.. రిజిస్ట్రార్ మాత్రం తనకు ఈ వినతిపత్రాల గమనార్హం.తాము సీజేఐ పదవిని ఎంతో గౌరవిస్తామని, కానీ నల్సార్‌లో తాము నేర్చుకున్న రాజ్యాంగ స్ఫూర్తికి భంగం కలిగించే అంశాలను మాత్రం సమర్థించలేమని స్టూడెంట్ బార్ కౌన్సిల్ ప్రతినిధులు తేల్చిచెప్పారు. ఈ అంశంపై వర్సిటీ అధికారులు సానుకూలంగా స్పందించి, విద్యార్థి ప్రతినిధులతో చర్చలు జరిపి తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇలా విద్యార్థులు, యాజమాన్యం మధ్య నెలకొన్న ఈ ఘర్షణ వాతావరణం ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశమైంది.

# ప్రియాంక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుంది



హైదరాబాద్, ఆగస్టు 10 : వైద్య విద్యార్థిని ప్రియాంక మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి హెచ్చరించారు. గాంధీ ఆస్పత్రిలోని మార్చురీలో ప్రియాంక భౌతికకాయాన్ని మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమా ర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు నివాళులు అర్పించారు. ప్రియాంక తండ్రిని వారు ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రియాంక ఘటన అత్యంత దని తెలిపారు.సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి తమకు, అధికారులకు ప్రియాంక కుటుంబాన్ని పరామర్శించాలని ఆదేశాలు ఇచ్చారని మంత్రి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవడం అవసరమని చెప్పుకొచ్చారు. ప్రియాంక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చట్టాల్లో ఉన్న లొసుగులను ఆసరా చేసుకొని నిందితులు తప్పించుకోకుండా కఠినతరం చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ సర్కార్‌పై పొంగులేటి అబద్ధాలు



హైదరాబాద్, ఆగస్టు 10 కాంగ్రెస్ సర్కార్ అలవికాని హామీలిచ్చి అమలు చేయలేక గత ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ కాలమెల్లదీస్తుందని ప్రత్యేకించి చెప్పనసరం లేదు. కాంగ్రెస్ సర్కార్ పనితీరు ఎలా ఉందో తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన కామెంట్స్ మరోసారి చెప్పకనే చెబుతున్నాయి. కమలాపూర్ మండలంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం తరపున ఇంకా కొన్ని కార్యక్రమాలు చేయాల్సి ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఆనాటి ప్రభుత్వం కొల్లగొట్టిన కారణంగా అనుకున్నవన్నీ ఇంకా పూర్తిగా ఇవ్వలేదు. తప్పకుండా ఇచ్చి తీరుతామని అన్నారు. దీంతో పక్కన ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కలగజేసుకొని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై మండిపడ్డారు.బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల గురించి అబద్ధాలు చెప్తున్నారంటూ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై కౌశిక్ రెడ్డి ఫైర్ అయ్యారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ కౌశిక్ రెడ్డి అప్పుల పేరుతో కాంగ్రెస్ తప్పించుకునే డ్రామాలు ఆపాలని పొంగులేటితో సభా వేదికపైనే కౌశిక్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

# హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలి

హైదరాబాద్, ఆగస్టు 10 : ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాన్ని రాష్ట్రమంతా విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా బీజేపీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమాన్ని పురస్కరించుకుని బండి సంజయ్ హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద జాతీయ జెండాను ఈరోజు (సోమవారం) ఎగురవేశారు. అనంతరం పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మీడియాకు బండి సంజయ్ ఒక ప్రకటన విడుదల చేశారు.'తిరంగా యాత్ర'లను విజయవంతంగా నిర్వహించాలి..దేశవ్యాప్తంగా



'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాలను చేపడుతున్నట్లు బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

నుంచి 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో 'తిరంగా యాత్ర'లను విజయవంతంగా నిర్వహించాలని బీజేపీ శ్రేణులను బండి సంజయ్ కో రారు. కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రతి భారతీయుడు, విద్యార్థులు పెద్దఎత్తున భాగస్వా మ్యమై స్వచ్ఛందంగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరిం చుకుంటూ దేశంపై తమకున్న భక్తిభావాన్ని చాటుకోవడానికి ఇది సువర్ణావకాశమని పేర్కొన్నారు .స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేయాలి..స్వాతంత్ర్య దినోత్సవానికి ముందుగా, ఆగస్టు 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మహాపురుషులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేసి, స్మారక చిహ్నాల చుట్టూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ శ్రేణులను బండి సంజయ్ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి కూడలిలో తిరంగా ర్యాలీలు, దేశభక్తి ప్రదర్శనలు, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రతి పౌరుడిని మానసికంగా దేశంతో అనుసంధా నించే ఒక గొప్ప సామాజిక ఉద్యమంగా ఈ కార్యక్రమం రూపాంతరం చెందిందని తెలిపారు. ప్రతి ఏడాది ఇది ఘనంగా జరుగుతోందని గుర్తుచేశారు. 'మన జాతీయ త్రివర్ణ పతాకం దేశ ప్రజలందరి ఐక్యతకు, సమైక్యతకు, అఖండతకు ప్రతీక అని వెల్లడించారు. ప్రతి ఇంటా దేశభక్తి వాతావరణం పరిమళించేలా ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా చూసి 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌ను విజయవంతం చేయాలని బండి సంజయ్ కోరారు.

# గాంధీలో ఆధునిక హార్ట్ లంగ్ మిషన్ అందుబాటులోకి - రూ. లక్షల్లో ఖర్చయ్యే చికిత్స ఇకపై ఉచితం

హైదరాబాద్, ఆగస్టు 10 పేదలకు ప్రభుత్వ ఆసుపత్రులే దేవాలయల్లాం టివి. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి చూపించ్ుకునే స్థోమత లేక సర్కారు దవాఖాన్లనే నము ్మకుని బతుకుతుంటారు. నొప్పి, రోగం ఏం వచ్చినా అక్కడికే వెళ్తారు. ఈ క్రమంలో వారికేదైన పెద్దరోగం వచ్చిందంటే చాలు ఇక ఆశలు వదులుకుంటారు. ఎందుకంటే రూ. లక్షలు ఖర్చు చేసేంత డబ్బు వారి దగ్గర ఉండదు. కొన్ని జబ్బులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా నయం చేసేందుకు వీలుండదు. ఆ జబ్బుకు అందించే చికిత్స ఆధునికతతో కూడుకున్నదై ఉంటుంది. అలాంటి ఆధునిక చికిత్సలు కేవలం ప్రైవేట్? ఆసుపత్రుల్లోనే జరుగుతుంటాయి. అయితే గుండె, ఊపిరితిత్తుల వంటి క్లిష్టమైన శస్త్ర చికిత్సల సమయంలో ఆధునిక హార్ట్ లంగ్ మిషన్ అనేది ఎంతో ముఖ్యమైంది. అయితే ఇందుకు ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ. లక్షలు ఖర్చు అవుతాయి. దానిని దృష్టిలో పెట్టుకుని పేదలకు ఉచితంగా గాంధీ ఆసుపత్రిలో రూ.3 కోట్ల విలువైన ఆధునిక హార్ట్ లంగ్ మిషన్ అందుబాటులోకి వచ్చింది. దీంతో రోగులకు సులభంగా వైద్యులు చికిత్సలు షురూ చేశారు. ఈ యంత్రం పేషెంట్లకు సంజీవనిలా పనిచేస్తుంది.రోగుల తాకిడి ఎక్కువే : గాంధీ ఆసుపత్రిలో ప్రతి రోజూ కార్డియాలజీ, కార్డియో థోరాసిక్? ఓపీలకు రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కొందరు చిన్న పిల్లలకు పుట్టుకతోనే గుండెకు రంధ్రాలు ఉంటడంతో ఆసుపత్రిలో చేరుతారు. అత్యవసరం విభాగం కింద ఎంతో మంది వస్తుంటారు. ఆ సమయంలో రూ.లక్షలు ఖర్చయ్యే ఈ ఆధునిక చికిత్సలు లేకపోవడంతో కొందరు అక్కడే కన్నుమూస్తుంటారు. ఇక నుంచి అలాంటి క్లిష్టమైన పరిస్థితి ఉండదని వైద్యులు అంటున్నారు. ఎంత పెద్ద చికిత్సనైనా ఈ యంత్రం సాయంతో సులభంగా చేయవచ్చని వివరించారు. సర్జరీ సమయంలో మెదడు, మూత్రపిండాలు, కాలేయం వంటి ప్రధాన అవయవాలకు ఆక్సిజన్?ను ఈ యంత్రం ద్వారా అందించవచ్చని అంటున్నారు .ఈ సమస్య ఉన్న రోగులకు ఉపయోగం : సాధారణంగా గుండెకు సంబంధించిన సర్జరీలు ఏవైనా చేసినప్పుడు గుండె కొట్టుకోవడాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తారు. ఆ సమయంలో పేషెంట్?కు రక్తాన్ని సరఫరా చేసేందుకు ఈ యంత్రాన్ని ఉపయోగిస్తారు. ఇది శరీరంలోని చెడు రక్తాన్ని బయటకు తీసి ఆక్సిజనేషన్? చేస్తుంది. ఈ యంత్రంలో ఉండే కృత్రిమ ఊపిరితిత్తులు రక్తంలో నుంచి కార్బన్ డయాక్సైడ్‌ను తొలగిస్తాయి. పంప్ ద్వారా శుద్ధి చేసిన ఆక్సిజన్ ఉన్న రక్తాన్ని శరీరంలోకి పంపి రోగి ప్రాణాలను కాపాడుతుంది.ఊపిరితిత్తులు దెబ్బతిన్నప్పుడు వెంటిలేటర్ కూడా పనిచేయని పరిస్థితిలో రోగికి శ్వాస అందించి సంజీవనిలా పనిచేస్తుంది.గుండె మార్పిడి, ఊపిరితిత్తులు మార్పిడి సమయంలో కూడా ఇదే యంత్రాన్ని ఉపయోగిస్తారు.కొందరు చిన్న పిల్లలు, పెద్దల్లో గుండె రంధ్రాలు (ఏఎస్‌డీ, వీఎస్‌డీ)ను సరిచేసే శస్త్రచికిత్సల్లో దీన్ని వాడతారు.




# కోటి మందికిపైగా స్మార్ట్ రేషన్‌కార్డులు ఇవ్వబోతున్నాం

సంగారెడ్డి, ఆగస్టు 10: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 15న జిల్లాలో పర్యటించనున్నారు. సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సీఎం పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా ఈరోజు (సోమవారం) తారా డిగ్రీ కాలేజీలో హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలో సభా స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చారని విమర్శించారు. కోటి 5 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్‌తో పని చేస్తోందని జగ్గారెడ్డి తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగిన విషయమన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమైనా కాంగ్రెస్ పార్టీ తరఫున సీఎం రేవంత్‌కు ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. సభని 50 వేల మందితో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు.



# నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతాం



వరంగల్ జిల్లా : ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం : అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు.లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారుఆయన ఎలాంటి వ్యక్తో తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు.

# సాగునీటి కోసం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాసిన హరీశ్ రావు

హైదరాబాద్, ఆగస్టు 10 తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందేళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని,




దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు.ఒకవైపు ఎల్‌నినో వల్ల తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ (ాపీణ) పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు.మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని నింపి ా=ూా ాూా+జు-2లోని ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని లేఖలో కోరారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4 లక్షల ఎకరాలు సాగైన విషయం గుర్తించి, ఈ వానాకాలం పంటకు, అదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com